నేడు 2.79లక్షల మంది ఖాతాల్లో నగదు జమ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల్లో అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం నగదు జమచేయనున్నారు. 2,79,065 మందికి రూ.590.91 కోట్లు విడుదల చేయనున్నారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సిఎం బటన్‌నొక్కి వారి ఖాతాల్లో జమచేస్తారు. దీంతోపాటు జూన్ 2022 నుంచి నవంబర్ 2022 వరకు అర్హులైన వారికి పెన్షన్, బియ్యం, ఆరోగ్యశ్రీ కార్డులు, ఇళ్ల పట్టాలకు సంబంధించిన వెరిఫికేషన్ ప్రస్తుతం జరుగుతోందని రాష్ట్రప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నెల 30వ తేదిన తుది జాబితా ప్రచురించి జనవరి 1 నుంచి 2023న పెంచిన పెన్షన్‌తోపాటు అన్ని కార్డులు, ఇళ్ల పట్టాల పంపిణీ గ్రామ, వార్డు సచివాలయాల వలంటీర్లు ఇంటికే వచ్చి అందిస్తారని వెల్లడించింది.

అపార్టుమెంట్‌పై నుంచి దూకి వైద్య విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ, విశాఖ

మార్కులు తక్కువచ్చాయని మనస్తాపంతో అపార్టుమెంట్‌పై నుంచి దూకి వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం విశాఖ నగరంలోని ఎండాడలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... సీతమ్మధార ప్రాంతంలో నివసిస్తున్న నేవెల్ ఎస్‌బిసిలో గల ఎల్ అండ్ టిలో మేనేజర్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్, రాధిక దంపతుల కుమారుడు గోగినేని గిరితేజ (20) గీతం మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కుమార్తె గీతం ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతుంది. గిరితేజకు మొదటి ఏడాది సెమిస్టర్‌లో తక్కువ మార్కులు వచ్చాయి. దీంతో గిరితేజ మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం ఉదయం సీతమ్మధారలోని ఇంటి నుంచి గిరితేజ, అతని చెల్లెలు ఇద్దరూ కలిసి ఆటోలో కాలేజీకి బయలు దేరి వెళ్లారు. చెల్లెలు ఇంజినీరింగు కాలేజీ వద్ద దిగాక గిరితేజ తను చదువుతున్న కాలేజీకి అని వెళ్లిపోయాడు. ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో ఎండాడలోగల వైశాఖ స్కైలైన్ అపార్టుమెంట్ బి-4 బ్లాక్ పైనుంచి కిందకు దూకేశాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఆరిలోవ ఇన్‌ఛార్జి సిఐ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ అనీల్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. గిరితేజ 10 గంటలకు కాలేజీలో పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. కాలేజీకి వెళ్లాల్సిన గిరితేజ ఎండాడలోని అపార్టుమెంట్‌కు ఎందుకు వెళ్లాడు? అక్కడ ఏమి జరిగింది? అపార్టుమెంట్ పైనుంచి ఎందుకు దూకాడు అనే కోణంలో పోలీసులు దర్యాప్తుచేపట్టారు.

మార్చి 15 నుంచి ఇంటర్ పరీక్షలు

ఏప్రిల్ 15 నుంచి ప్రాక్టికల్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ పరీక్షలు పబ్లిక్ పరీక్షలు 2023 మార్చి 15 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల టైం టేబుల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎంవి శేషగిరిబాబు సోమవారం ఒక ప్రకటన ద్వారా విడుదల చేశారు. ప్రతిఏటా ప్రాక్టికల్ పరీక్షలను పబ్లిక్ పరీక్షల కంటే ముందుగా ఇంటర్ బోర్డు నిర్వహించేది. ఈ సారి మాత్రం పబ్లిక్ పరీక్షల తరువాత నిర్వహించనుంది. ప్రాక్టికల్స్ పరీక్షలు ఏప్రిల్ 15 నుంచి 25వ తేదీ వరకు, రెండో విడత ఏప్రిల్ 30నుంచి మే 10 వరకు జరుగనున్నాయి. ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు , మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. జనరల్ కోర్సు విద్యార్థులకు రోజుకు రెండు సెషన్స్‌లో జరగనున్నాయి. పబ్లిక్ పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మార్చి 16 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. వొకేషనల్ విద్యార్థులకు కూడా ఈ టైం టేబుల్ ప్రకారమే జరుగుతాయి. ఈ టైం టేబుల్ విడిగా విడుదల కానుంది. నైతిక, మానవ విలువల పరీక్షను ఫిబ్రవరి 22న, పర్యావరణ విద్య పరీక్ష ఫిబ్రవరి 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించనుంది.

హెటెరో కోవిడ్ మందుకు డబ్ల్యుహెచ్‌ఓ సిఫార్సు

హైదరాబాద్ : హెటెరో సంస్థ అభివృద్ధి చేసిన కోవిడ్ ఔషధం నిర్మాకామ్ జనరిక్ వెర్షన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) సిఫార్సు (ప్రిక్వాలిఫికేషన్ ఆఫ్ మెడిసిన్స్ ప్రోగ్రామ్) లభించింది. నిర్మాట్రెల్విర్ 150 ఎంజి (రెండు ట్యాబెట్లు), రిటోనావిర్ 100 ఎంజి (ఒక ట్యాబ్లెట్) కలిపి నిర్మాకామ్ పేరుతో రూపొందించిన కాంబో ప్యాక్‌ను డబ్ల్యుహెచ్‌ఓ సిఫార్సు చేసినట్లు హెటెరో సంస్థ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసుపత్రిలో చేరే ప్రమాదం ఎక్కువగా ఉన్న కోవిడ్-19 రోగులకు, అంటే వ్యాక్సినేషన్ పొందని, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న కోవిడ్ రోగులకు నిర్మాట్రెల్విర్ - రిటోనావిర్‌ను ఇవ్వవచ్చునని డబ్ల్యూహెచ్‌ఒ సిఫార్సు చేసినట్లు పేర్కొంది. కోవిడ్ నిర్ధారణ అయిన తరువాత వీలైనంత త్వరగా లేదా కోవిడ్ వ్యాధి లక్షణాలు కనిపించిన ఐదు రోజుల్లోపు ప్రిస్క్రిప్షన్ ప్రకారమే ఈ మందును వాడాలని హెటెరో తెలిపింది. ఈ ఔషధాన్ని తయారు చేయడానికి, మార్కెట్ చేయడానికి డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డిసిజిఐ) ఇప్పటికే అత్యవసర వినియోగ అనుమతి ఇచ్చింది. దేశంలోని అన్ని హెటెరో ప్లాంట్లలోనూ ఈ నిర్మాకామ్ తయారువుతోంది.

సచివాలయాల్లో ఖాళీలు భర్తీ

- భూ హక్కు పత్రాల లబ్ధిదారులకు లేఖలు
- సమీక్షలో సిఎం ఆదేశం

భూ సర్వేకు ఉపయోగించే డ్రోన్ ను పరిశీలిస్తున్న సిఎం వైయస్ జగన్, చిత్రంలో కార్యదర్శి సిద్ధార్థ జైన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న ఖాళీలను తక్షణం భర్తీ చేసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు - భూరక్ష పథకంపై క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాల్లో సిబ్బంది కొరత లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఎక్కడైనా ఖాళీలు ఏర్పడితే వెంటనే భర్తీ చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే కార్యక్రమం సిబ్బంది కొరత కారణంగా ఎటువంటి పరిస్థితుల్లోనూ వెనుకబాటు పడకూడదన్నారు. నిషేధిత భూముల జాబితా (22ఎ)కింద ఏళ్ల తరబడి పెండింగ్‌లో సమస్యలు పరిష్కారమై హక్కు పత్రాలు పొందిన ప్రతి ఒక్కరికి వ్యక్తిగతంగా లేఖలు రాయాలని చెప్పారు. తొలివిడతలో సర్వే పూర్తయిన 2వేల గ్రామాలకు సంబంధించి భూ హక్కు పత్రాలు అందించే కార్యక్రమం జనవరి నాటికి పూర్తి కావాలని చెప్పారు. దీనికోసం సర్వే రాళ్ల ఉత్పత్తిని వేగం చేయాలన్నారు. భూగర్భగనులశాఖ అధికారులు సర్వే రాళ్ల ఉత్పత్తి పెరిగేలా అదనపు ఏర్పాట్లు చేసుకోవాలని సిఎం అధికారులకు సూచించారు. అధికారులు మాట్లాడుతూ 2023 జులై నాటికి పట్టణ ప్రాంతాల్లో సమగ్ర సర్వే హక్కు పత్రాల పంపిణీ పూర్తి చేయనున్నట్లు చెప్పారు. 123 కార్పొరేషన్లు, మునిసిపాలిటీల పరిధిలో 1,16,685 ప్రభుత్వ, పోరంబోకు ల్యాండ్ పార్శిల్స్‌కు సంబంధించి 3,37,702 ఎకరాల భూమిని గుర్తించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, సిఎం ముఖ్య సలహాదారు అజయ్‌కల్లాం, సిసిఎల్ఎ సాయిప్రసాద్, పంచాయతీరాజ్ ,గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, సిసిఎల్ఎ కార్యదర్శి ఎఎండి ఇంతియాజ్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, మైనింగ్ శాఖ డైరెక్టర్ విజి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పింఛను తొలగింపు దారుణం

- అనంతపురం, తిరుపతిలో ఆందోళనలు

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం, తిరుపతి జిల్లాల్లో సోమవారం ఆందోళనలు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయాలు, సచివాలయాల ఎదుట సిపిఎం, టిడిపి ఆధ్వర్యంలో నిరసన తెలిపి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

తిరుపతి, గూడూరులో నిరసన కార్యక్రమాలు జరిగాయి. తిరుపతిలో 11,274 పింఛన్లు రద్దు చేసేందుకు నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అన్నారు. విద్యుత్తు మీటర్లు మూడు ఉన్నాయని, 300 యూనిట్లకు పైబడి కరెంట్ వినియోగిస్తున్నారని తప్పుడు నోటీసులు ఇచ్చి కుట్రపూరితంగా పింఛన్లు రద్దు చేస్తున్నారని విమర్శించారు. ధర్నా అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. గూడూరు పరిధిలోని చెన్నూరు గ్రామ మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయం ముందు నిరసన తెలిపారు. గూడూరు పట్టణంలో 600 మందికి వివిధ కారణాలతో పింఛన్లు తొలగించారని జనసేన పట్టణ అధ్యక్షులు ఇంద్రవర్ధన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పింఛన్ల తొలగింపును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. రాయదుర్గం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. హిందూపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

వెరిఫికేషన్ పేరుతో సంతకం పెట్టించుకొని పింఛను తొలగించారు

వెరిఫికేషన్ పేరుతో సంతకం పెట్టించుకుని పింఛను తొలగించారని ఓ వికలాంగుడు వాపోయారు. తనకు జరిగిన అన్యాయంపై గుంటూరు జిల్లా కలెక్టర్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసి, అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ..తనకు వెయ్యి గజాల స్థలం ఉందంటూ తప్పుడు నివేదికతో పింఛను తొలగించారని నగరంలోని 61వ వార్డులో నివసిస్తున్న మల్లె శివశంకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిపూట వెరిఫికేషన్ పేరుతో పేపరును మడతపెట్టి, తనతో సంతకం చేయించుకొని, తర్వాత పింఛను తొలగిస్తున్నట్లు నోటీసులు ఇచ్చారని తెలిపారు. తనకు ఎలాంటి స్థలమూ లేదని, తన తల్లిదండ్రులు చనిపోయారని, బడ్డీ కొట్టు పెట్టుకొని జీవిస్తున్నానని, పింఛనే జీవనాధారమని చెప్పారు.

నోటీసులు అందుకుని వృద్ధుడు మృతి

చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ ఇరువారానికి చెందిన పళణి శెట్టియార్ (68) గత ఎనిమిది సంవత్సరాలుగా సామాజిక ఫించన్ పొందుతున్నాడు. భార్య, కుమారుడు ఉన్నారు. వీరికి చిన్నాపాటి పెంకుటిల్లు మినహా ఎలాంటి ఆస్తులులేవు. ప్రభుత్వం ఇచ్చే పింఛను డబ్బులతోనే జీవనం గడుపుతున్నారు. పింఛను పొందేందుకు అర్హత నిరూపించుకోవాలంటూ వలంటీర్ పళణి శెట్టియార్ ఆదివారం శెట్టియార్ ఇంటికి వచ్చి నోటీసు ఇచ్చారు. ఇక పై పింఛను రాదేమోనన్న ఆందోళనతో శెట్టియార్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు.

పారిశుధ్య కార్మికులను కొనసాగించాలి

సిఆర్‌డిఎ కమిషనర్‌కు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు వినతిపత్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధానిలో గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను జనవరి నుంచి కొనసాగించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు ఎం రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్‌ను సోమవారం తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. రాజధాని 29 గ్రామాల్లో 2017 నుంచి కార్మికులు పనిచేస్తున్నారని వివరించారు. కాంట్రాక్ట్ ఏజెన్సీ టెండర్ కాలం డిసెంబర్‌తో ముగియనుందని తెలిపారు. కొత్త టెండర్ పిలిచి జనవరి నుంచి యథావిధిగా వారి పని కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులను పని నుంచి నిలుపుదల చేస్తే వారికి ఉపాధి పోయి కుటుంబాలు రోడ్డు పాలవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజధాని గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా కృషి చేసి పనిభద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగుల పేరుతో కార్మికులకు గతంలో తొలగించిన సామాజిక పెన్షన్లను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. హామీ ఇచ్చిన విధంగా ఈ నెల 23వ తేదీ నాటికి కార్మికుల జీతాలు చెల్లించినందుకు సిఆర్‌డిఎ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి ప్రజా గర్జన విజయవంతం చేయాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కునగరంలోని తృష్ణ మైదానంలో మంగళవారం లక్ష మందితో ప్రజా గర్జన బహిరంగ సభ జరగనుందని, ఉక్కు ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, నిర్వాసితులు కుటుంబ సభ్యులతో పాల్గొని జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపునిచ్చింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 683వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగ కార్మికులు కూర్చున్నారు.

ICICI Home Finance | **కార్పొరేట్ ఆఫీసు:** ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, అంధేరి-కుర్ల రోడ్, అంధేరి (ఈస్ట్), ముంబయి-400059, ఇండియా.
శాఖ కార్యాలయం: 4వ అంతస్తు, ఆఫీస్ నం.436-443 ఎమెరాల్డ్ వన్, విన్ వార్డ్ బిజినెస్ పార్క్, జెతాల్‌పూర్ రోడ్డు, వడోదర, గుజరాత-390020.
శాఖా కార్యాలయం: షాప్ నం.8 మరియు 9, 1వ అంతస్తు, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ ప్రక్కన, పార్క్ రోడ్డు, కర్నూలు-518001.

[**రూల్ 8(6)కు నిబంధన చూచుట**]
స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు.
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్ధతిన" మరియు "ఏదిఏమైనా ఆవిధంగా" విక్రయించబడునని సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది, సంక్షిప్త వివరాల ప్రకారం దిగువ ఇవ్వబడినాయి;

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీతలు/హామీదారులు/ చట్టబద్ధ వారసులు. లోను ఖాతా నం.	తెలిసిన రుణభారాలతో సెక్యూర్డ్ అస్సెట్(ల) వివరాలు, ఏవైనా	మొత్తం బకాయిలు	రిజర్వ్ ధర బయానా మొత్తం	ఆస్థి తనిఖీ తేది మరియు సమయం	వేలం తేది & సమయం
(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)
1.	పసుపుల మాధవి (రుణగ్రహీత) పి. పుల్లయ్య (సహ రుణగ్రహీత) లోను ఖాతా నం. NHANA00001245957	ఓపెన్ ప్లాట్, ప్లాట్ నం.131, ఎస్‌వై నం.243/1, అనంతపురం-515001.	Rs. 9,41,604/- 16th Dec, 2022	Rs. 5,04,000/- Rs. 50,400/-	10th Jan, 2023 11:00 AM-0300 PM	12th Jan, 2023 02:00 PM-03:00 PM

మా వేలం ఏజెన్సీ ఆక్షన్ టైగర్ వెబ్‌సైట్ (URL Link-https://BestAuctionDeal.com) మీద ఆన్‌లైన్ వేలం నిర్వహించబడును. 11 జనవరి, 2023న సా.5.00 గం.లలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించుటకు తనాఖదారులు/నోటీసు ఇవ్వడమైనది లేకపోతే ఈ సెక్యూర్డ్ అస్సెట్స్ పైన షెడ్యూల్ ప్రకారం విక్రయించబడును.
కాగోరు బిడ్డర్(లు) బయానా (ఇఎండి) ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) (కాలమ్ ఇ చూచుట) ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, షాప్ నం.8 మరియు 9, 1వ అంతస్తు, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ ప్రక్కన, పార్క్ రోడ్డు, కర్నూలు-518001 లేదా 11 జనవరి, 2023న సా.04:00 గం.లలోపు దాఖలు చేయాలి. దయచేసి గమనించండి, కాగోరు బిడ్డర్(లు) ఒకవేళ పైన పేర్కొన్న సమయం ప్రకారం వారి ఆఫర్ దాఖలు చేయనట్లయితే అప్పుడు టెండర్ డాక్యుమెంట్‌ల యొక్క సంతకంచేసిన కాపీ ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, షాప్ నం.8 మరియు 9, 1వ అంతస్తు, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ ప్రక్కన, పార్క్ రోడ్డు, కర్నూలు-518001 లేదా 11 జనవరి, 2023న సా.05:00 గం.లలోపు దాఖలు చేయాలి. బయానా డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) "ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్-ఆక్షన్" పేరిట ఏదైనా జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి అనంతపురం వద్ద చెల్లించాలి.
తనిఖీకి సంబంధించిన ఏదైనా తదుపరి వివరణలకు, వేలం నియమాలు మరియు షరతులు లేదా టెండర్ల దాఖలు, 7021072869 మీద ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను దయచేసి సంప్రదించండి.
అధీకృత అధికారి ఎలాంటి కారణం చూపకుండా అన్ని బిడ్‌లు లేదా ఏదైనా తిరస్కారం చేసే హక్కు కలదు. విక్రయం వివరాణత్మక నియమాలు మరియు షరతులు, https://www.icicihfc.com/ దయచేసి చూడండి..

తేది: 27 డిసెంబర్, 2022,
ప్రదేశం: అనంతపురం.

అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు

కాసర్ల కమలమ్మ కన్నుమూత

నివాళులర్పించిన సిపిఎం నాయకులు

భౌతికాయాన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అప్పగింత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, సిపిఎం సీనియర్ నాయకులు కాసర్ల కమలమ్మ (95) కన్నుమూశారు. నల్లగొండ పట్టణంలోని బాదేగూడెంలో వయోభారంతో ఆమె ఆదివారం రాత్రి మరణించారు. సిపిఎం నేతలు సోమవారం ఆమె భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజాం సైన్యాలకు, రజాకార్లకు ఆ తర్వాత నెహ్రూ సైన్యాలకు, నిర్బంధాలకు వ్యతిరేకంగా స్వేచ్ఛ కోసం లక్షలాది మంది సాయుధ పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. అమోఘమైన విజయాన్ని సాధించిన ఆ పోరాటంలో కమలమ్మ ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు.

ఆమె మరణం పార్టీకి తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం నాయకులు పాలడుగు నాగార్జున, సయ్యద్ హాశం, సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి ఉన్నారు. కమలమ్మ భౌతికకాయాన్ని సోమవారం ఆమె కుటుంబ సభ్యులు, కుమారుడు కాసర్ల గౌతంరెడ్డి, ఐఎంఎ జాతీయ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పుల్లారావు ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మెడికల్ కాలేజీకి అప్పగించారు.

మార్గదర్శిపై కఠిన చర్యలు వద్దు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

చిట్‌ఫండ్ కార్యకలాపాలను నిర్వహించే సంస్థలు ప్రభుత్వ అధికారులు ఇచ్చిన నోటీసులకు జవాబు చెప్పాల్సిందేనని మార్గదర్శి చిట్‌ఫండ్ కేసులో హైకోర్టు స్పష్టం చేసింది. అలాగే, చిట్‌ఫండ్ యాక్ట్ 46(3) సెక్షన్‌లో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని తెలిపింది. అప్పటి వరకు మార్గదర్శి విషయంలో బలవంతపు చర్యలు చేపట్టరాదని అధికారులను ఆదేశించింది. రిజిస్ట్రేషన్లు, డాక్యుమెంట్ల స్వీకరణ, అనుమతులు, సెక్యూరిటీ డిపాజిట్ విడుదల వంటి అంశాలన్నింటిలోనూ నిబంధనల మేరకు చేయాలని మధ్యతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి సోమవారం ఆదేశాలిచ్చారు. మార్గదర్శి చిట్స్ విషయంలో అధికారులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడం లేదని ఆ సంస్థ అధీకృత ఆఫీసర్ శ్రీనివాసరావు వేసిన అనుబంధ పిటిషన్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. చందాదారుల నుంచి ఫిర్యాదుల లేవని, అవకతవలు జరిగితే వాటిని సరిచేయాలని అధికారులు నోటీసులు ఇవ్వాలని చెప్పింది. అదే సమయంలో అధికారులు ఇచ్చిన నోటీసులకు మార్గదర్శి జవాబు ఇవ్వాలని చెప్పింది. నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని పేర్కొంది.

ఎమ్మెల్యేల కొనుగోలు కేసు దర్యాప్తు

సిబిఐకు బదిలీ

తెలంగాణ హైకోర్టు ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా రాజకీయ సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసు దర్యాప్తును సిబిఐకు బదిలీ చేస్తూ తెలంగాణ హైకోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఈ కేసులో బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ప్రేమేంద్రరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణార్హత లేదని కొట్టిపారేసింది. సిట్ దర్యాప్తుపై తమకు నమ్మకం లేదంటూ ఈ కేసులో నిందితులు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి డిసెంబర్ 16 నాటికే ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. తీర్పును జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం సోమవారం ప్రకటించింది. సిట్ తరుపున అడ్వకేట్ జనరల్ బిఎస్ ప్రసాద్ మరోసారి వాదనలు వినిపించారు. కేసును సిబిఐకి అప్పగించడం వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండబోదని కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు దశలో ఉన్నందున సిట్‌తో దర్యాప్తు చేయించాలని కోరారు. ఆయన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఇప్పటి వరకు జరిపిన దర్యాప్తు వివరాలను సిబిఐకి అందజేయాలని సిట్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. తీర్పు వెలువడిన అనంతరం బిజెపి తరుపు లాయర్ రామచందరరావు మీడియాతో మాట్లాడారు. సిట్ దర్యాప్తు సరిగా జరగలేదని ఆరోపించారు. రాజకీయ దురుద్దేశాలతోనే కేసు పెట్టారని, అవినీతి కేసుల్లో ఎసిబికి తప్ప, సిట్‌కు విచారణ అధికారం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. కాగా, తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు యత్నించారంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు సింహయాజీ, రామచంద్రభారతి, నందకుమార్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా దర్యాప్తును సీనియర్ ఐపిఎస్ అధికారి సివి.ఆనంద్ నేతృత్వంలోని సిట్‌కు తెలంగాణ ప్రభుత్వం అప్పగించిన సంగతి తెలిసిందే.

అంతరాష్ట్ర నకిలీ కరెన్సీ, అక్రమ ఆయుధ విక్రయ ముఠా అరెస్ట్

స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో డిజిపి తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంతరాష్ట్ర అక్రమ ఆయుధ ముఠాలను రాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో అక్రమంగా ఆయుధాలను విక్రయించడంతోపాటు నకిలీ కరెన్సీ మారకం చేస్తున్న ముఠాను అనంతపురం జిల్లా ఎస్‌పి కాగినెల్లి ఫకీరప్ప నేతృత్వంలో స్పెషల్ ఆపరేషన్ టీమ్స్ పక్కా సమాచారంతో అరెస్ట్ చేసినట్లు డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిందితులనుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడారు. బళ్లారి, అనంతపురం కేంద్రంగా ఈ ఆయుధ వ్యాపారం నడుస్తోందని తెలిపారు. నకిలీ కరెన్సీ కేసులో నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా, ఈ ఆయుధాల అక్రమ తయారీ గుట్టు వెలుగులోకి వచ్చిందన్నారు. బెంగుళూరుకు చెందిన రౌడీషీటర్లు జంషీద్, ముబారక్, రియాజ్, అమీర్ షాషాలను ఈ కేసుల్లో అరెస్ట్ చేశామని తెలిపారు. మధ్యప్రదేశ్‌లో ఆయుధాలను అక్రమంగా తయారు చేస్తున్నట్లు తేలిందని చెప్పారు. వీరితో పాటు ఆయుధాలు తయారు చేస్తున్న రాజ్ పాల్ సింగ్ అనే కీలక నిందితుడిని కూడా అరెస్ట్ చేశామని తెలిపారు. వీరు గతంలో హత్యలు, నకిలీ కరెన్సీ చెలామణి, ఆయుధాల విక్రయాలు, గంజాయి స్మగ్లింగ్ చేసినట్లు గుర్తించామన్నారు. నిందితుల నుంచి 18 ఆయుధాలతోపాటు 95 రౌండ్ల బుల్లెట్లు 6 అదనపు మ్యాగజైన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటిలో 9ఎంఎం పిస్టల్స్, తపంచా, రివాల్వర్లు ఉన్నాయని తెలిపారు. ఈ నిందితులపై ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్నాటక, గోవా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కేసులు వున్నాయని చెప్పారు.

ఆరోగ్యశాఖ మంత్రి ఇలాఖాలో భూకబ్జాలు : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్యశాఖ మంత్రి ఇలాఖాలో అడ్డూ, అదుపు లేకుండా భూకబ్జాలు సాగుతున్నాయని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా భూకబ్జాల్లో అధికార పార్టీ నేతలు మునిగితేలుతున్నారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దశాబ్దాల నుంచి రైతుల సాగులో ఉన్న భూములు జగన్ ప్రభుత్వంలో దేవాదాయ శాఖ భూములుగా మారిన ఘటన ఆరోగ్యశాఖ మంత్రి ఇలాఖాలో జరిగిందని అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి యడ్లపాడు మండలం చంఘీజ్‌ఖాన్ పేటకు చెందిన రైతుల స్వాధీనంలో 260 ఎకరాలకుపైగా భూమి ఉందని తెలిపారు. ఒక్క కలంపోటుతో రాత్రికి రాత్రి దేవాదాయ శాఖ పరంకావడం గమనార్హమని పేర్కొన్నారు. న్యాయస్థానం తీర్పుతో భూములపై రైతుల పేర్లతో రైత్వారీ పట్టాలు కూడా అధికారులు గతంలో మంజూరు చేశారని వివరించారు. ఆ భూములపై కన్నేసిన స్థానిక వైసిపి నేతలు కొందరు అధికారులతో చేతులు కలిపి, కొట్టేయడానికి పథకం వేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తన నియోజకవర్గంలో జరుగుతున్న భూదోపిడీ గురించి ఆరోగ్యశాఖ మంత్రికి తెలియదా అని ప్రశ్నించారు. దశాబ్దాల నుంచి భూములు సాగు చేసుకుంటూ కుటుంబాలు పోషించుకుంటున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

టిడిపి ఎన్‌ఆర్‌ఐ ఆధ్వర్యంలో 13 మందికి అమెరికాలో ఉద్యోగాలు

టిడిపి ఎన్‌ఆర్‌ఐ విభాగం ఆధ్వర్యంలో 13 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు ఆ విభాగం ఇన్‌చార్జి వేమూరు రవికుమార్, హెచ్‌ఆర్‌డి చైర్మన్ రామాంజనేయులు తెలిపారు. ఉద్యోగ నియామక పత్రాలను టిడిపి కార్యాలయంలో సోమవారం అభ్యర్థులకు అందించారు. రాష్ట్రంలోని యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో టిడిపి అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సూచనలు ఆదేశాలు ప్రకారం హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు అమెరికాలో ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు.

రాష్ట్రాలపై బిజెపి కుట్రపూరిత దాడి

మొదటి పేజీ తరువాయి

చట్టాలను రాష్ట్రాలను సంప్రదించకుండానే మోడీ సర్కారు చేసింది. ఈ చర్య రాష్ట్రాల హక్కులను హరించడమే. ఐఎఎస్‌ల డిప్యూటేషన్‌పై కేంద్రానికే తుది అధికారం కట్టబెడుతూ చేసిన చట్ట సవరణ రాష్ట్రాల హక్కులకు విఘాతం. ఈ చర్యను కేరళతో సహా ఏడు రాష్ట్రాలు వ్యతిరేకించాయి. వాటిలో ఆంధ్రప్రదేశ్ లేదు. కేంద్రం తెచ్చిన నూతన విద్యా విధానం సైతం రాష్ట్రాల హక్కుల్లో జోక్యమే.

గుప్పెట్లో నిధులు

మోడీ సర్కారు రాగానే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి రాష్ట్రాల ఆర్థిక వనరులకు గండి కొట్టిందని రాజేష్ చెప్పారు. జిఎస్‌టి వలన రాష్ట్రాల స్వంత ఆదాయ వనరులు దెబ్బతిన్నాయి. కేంద్రంపై ఆధారపడేలా చేశారు. రాష్ట్రాల సొంత పన్ను ఆదాయ వనరులు 69 నుంచి 38 శాతానికి తగ్గాయి. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 42 శాతం వాటా ఇస్తున్నారని మీడియాలో ఊదరగొడుతున్నారు. కానీ రాష్ట్రాలకు ఆదాయాలు పంచని సర్‌ఛార్జీలు, స్పెషల్ ఛార్జీలు పెంచి ఈ కాలంలో రూ.18 లక్షల కోట్లను కేంద్రం ఆర్జించింది. రాష్ట్రాలకు వాటా వచ్చే కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించింది. కార్పొరేట్లకు రూ.5 లక్షల కోట్ల రాయితీలిచ్చింది. అమలు సాధ్యంకాని కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్రాల మ్యాచింగ్ గ్రాంట్‌ను 25 శాతం నుంచి 40 శాతానికి పెంచి రాష్ట్రాలపై భారం మోపింది. ప్రభుత్వ నిర్వహణకు రాష్ట్రాలు 60 శాతం ఖర్చు పెడుతుండగా 40 శాతమే కేంద్రం వ్యయం చేస్తోంది. విద్య, వైద్యంలో రాష్ట్రాలే 80 శాతంపైన ఖర్చు చేస్తున్నాయి. కేరళకు ఒక్క ఏడాదిలో జిఎస్‌టి వలన నష్టం రూ.10 వేల కోట్లు, రెవెన్యూలోటు గ్రాంట్ తగ్గుదల వలన 6,717 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా తగ్గుదల వలన 12,800 కోట్లు... వెరసి 30 వేల కోట్లు కోల్పోయింది. ఇది కేరళను అతలాకుతలం చేసిన నష్టంతో సమానం. ఈ నష్టం కేంద్ర కల్పిత విపత్తు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న బిజెపిని ప్రజాస్వామ్య వాదులందరూ ప్రతిఘటించాలి. అదే ఎంబికి అర్పించే నిజమైన నివాళి.. అని రాజేష్ పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన పి మధు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధునిగా, వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట దార్శనికునిగా, కమ్యూనిస్టు సిద్ధాంతకర్తగా ఎంబి చేసిన సేవలు నిరుపమానమన్నారు. ఎంబివికె కార్యదర్శి పి మురళీకృష్ణ ఎంబివికె కార్యకలాపాల వార్షిక నివేదికను సభ ముందుంచారు. ఎంబివికె ట్రస్ట్ కార్యదర్శి వై వెంకటేశ్వరరావు వేదికపై ఆశీనులయ్యారు. తొలుత ఆహ్వానితులకు బిఆర్ తులసీరావు స్వాగతం పలికారు. సభ ప్రారంభానికి ముందు ఎంబి చిత్ర పటానికి ఎంబి రాజేష్, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.